# నగబుద్ధి

'కవిత'



అసూయ ఆడలక్షణం అంటారుకాని అది అసత్యమే. ఈర్ష్య. అసూయ.... ప్రేమ.... ద్వేషం.... మంచి.... చెడు ఇవి ఆడవాళ్ళలోనూ ఉంటాయి; మగవాళ్ళలోనూ ఉంటాయి. సెక్స్‌కి కాకుండా మానవ జాతికే చెందే లక్షణాలవి. ఎటొచ్చీ-ఆ భావాలను ప్రకటించుకోవడానికి వుండే అవకాశాల లోనే ఆడా మగా తేడా. కన్నీరు పెట్టడానికి ఆడదానికి బోలెడంత స్వేచ్ఛ; మగవాడి ఏడుపు అసహ్యంగా ఉంటుంది.

పెళ్ళయిన కొత్తలో—

వారిగురించి నాకేమీ తెలియదు.

"హేమమాలినిదే అందమంటే. ఆడవాళ్ళందరూ హేమమాలినిల్లా ఉంటే?" అన్నారు వారు సినిమానుంచి వచ్చాక.

అమాయకంగా అనేశాను – "నిజమే. ఆడవాళ్ళందరూ హేమమాలినులూ, మగవాళ్ళందరూ ధర్మేంద్రలూ ఐతే ఎంత బాగుంటుంది!"

నామాటతో ఆయన ఫీలింగ్సు మారిపోయాయి.

"నీకు ధర్మేంద్రంటే యిష్టమా?"

"ఊఁ. చాలా అభిమానిస్తాను."

ఆయన మాటలు ఆపేశారు – కొన్ని నిముషాలపాటు.

అప్పటికీ నేను గ్రహించలేక పోయాను. మెతుకు నొక్కిచూస్తేకాని అన్నం ఉడికిందో లేదో తెలియనట్లే—కొంతకాలం కాపురం చేస్తే తప్ప శ్రీవారి తత్వమూ తెలియదు కదా!

ఓసారి ఏదో ఎగ్జిబిషన్‌కి వెళ్ళాం.

అక్కడో చక్కని గ్రీకు చిత్రం ఉంది. బహుశా హెర్క్యులెస్‌దయి ఉండవచ్చు. కండలు తిరిగిన చేతులు.... చక్కనిసౌష్ఠవం.... దృష్టి నాకట్టుకుందియిట్టే.

"బాగుంది కదూ?"

పరధ్యానంగా "ఊఁ" అన్నాను.

"నిజంగా నీకు నచ్చిందా?" ఆశ్చర్యంగా అడిగారు.

అప్పుడు తెలుసుకున్నాను-ఆయన చూస్తున్న చిత్రం వేరని.

చాలా కళాత్మకంగా – నగ్నంగా నిలుచుని స్నానంచేస్తోందో గ్రీకు సుందరి.



"అదీ బాగుంది ఇదీ బాగుంది–" అనేశాను.

ఆయనకు అర్థమైపోయింది. "త్వరగా కదులు. మిగతా స్టాల్స్ చూడొద్దూ?"

నవ్వొచ్చింది. కోపం రాలేదు. జాలే వేసింది నిజానికి.

ఆయన కళ్ళల్లో స్పష్టంగా అసూయ తొంగి చూసింది–ఆ గ్రీకు శిల్పం మీద.

క్రమక్రమంగా నన్ను తనతో బయటకు తీసుకు వెళ్ళడం మానేశారు.

నేను చింతించలేదు. నా కాలక్షేపాలు నే నేర్పాటు చేసుకున్నాను. పుస్తకాలు, ఇంటి పనులు. క్షణం తీరిక లేకుండా ఉండడం అలవాటు చేసుకున్నాను. అందులో హాయి కనిపించేది.

ఆయన ఏదో ఒక అవకాశం తీసుకుని– "ఇవాళ మా టైపిస్ట్ ఎంత చక్కగా తయారై వొచ్చిందో తెలుసా? మనిషి భలే బావుంటుంది. జామిపండు రంగు ఆంగ్లో ఇండియన్ లే.... నీలంస్కర్టూ....బ్లాండ్ హెయిరూ....అచ్చంగా మర్‌మెయిడ్‌లా ఉందంటే నమ్ము–" అనేవారు. రోడ్డు మీద ఎదురయిన ఏ అమ్మాయినో పొగిడే వారు.

నాకు ఈర్ష్య వేసేది; కోపమూ వచ్చేది. అటువంటి మాటలు నా దగ్గర అనకపోతేనేం? క్షణికంగా అయినా నా మనసులో ముల్లు గుచ్చక పోతే ఏం?

నేనూ చెప్పగలను: మధ్యాహ్నం-ఎండలో కర్రలు కొట్టేవాడు కనిపించాడు. వాడి కండల మీద చెమట బిందువులు ముత్యాల్లా మెరిశాయి. ఎండ కూడా నిలవలేనంత నున్నని వొళ్ళు. ఆ నలుపులో ఎంత నిగనిగ—నేరేడు పండులా!

చెబితే ఏమౌతుందో నాకు తెలుసు.

కొన్ని నెలల సాహచర్యంలో ఆయన మనసు నేను తెలుసుకోగలిగాను. ఆడవాళ్ళు త్వరగా ఎదుగుతారన్నది మాత్రం నా పట్ల నిజమే ఐంది. వారు - ఇంకా బ్రహ్మచారి లాగే ప్రయత్నిస్తూ - తెలిసో తెలియకో ఏవో మాటలనేసి నన్ను బాధల కెరచేస్తూంటారు. వారి మనసు తెలుసుకున్న నేను మాత్రం అలా చేయను; చేయలేను — సహిస్తాను అంతే!

చాలా కాలానికి – బీచ్‌కి బయలుదేరమన్నారు.

ఆదివారం బీచ్ కలకలాడుతూంది. వేరుసెనగ పప్పుతిని - కూల్‌డ్రింక్ తాగి ఇసుకలో కూర్చున్నాం. రకరకాల జంటలు మా ముందు నుంచి కదులుతున్నాయి. సముద్రాన్ని చూస్తూంటే నాలో ఎక్కడలేని చైతన్యమూ వచ్చేసింది. సముద్ర దృశ్యం నాలో అటువంటి మార్పు కలగజేయడం తరచుగా జరిగేదే. అదేమిటో, కెరటాలను చూస్తేచాలు వొళ్ళుమరచిపోతాను.



"అబ్బ! ఆ అమ్మాయి చూడు....ఎంత చక్కగా ఉందో. ఎంత అందంగా ఉషారుగా...." నన్ను నేను మరచిపోయిన పరిస్థితి అది.

"అతన్ని చూస్తూంటే అసూయవేస్తోంది. ఆ అమ్మాయి అతనిది!—"

నా నోరు జారింది. "ఉహుఁ. అదృష్టమంతా ఆ అమ్మాయిదే. ఎన్నిజన్మల పుణ్యం కాకపోతే అంత చక్కటి భర్త దొరుకుతాడు! చూడండి.... ఆ పర్సనాలిటీ....హుందా....దర్జా...."

ఆయన–లేచి వెళ్ళిపోయారు–ఒంటరిగా.... కోపంగా.

నేను బతిమాలదల్చుకోలేదు. నేనేం తప్పు చేశానని? వారు తన మనసులోని మాట ఎంత స్వతంత్రంగా స్వేచ్ఛగా బయటకు చెప్పారో, నేనూ అలాగే చేశాను. వారిని కించపరిచే ఉద్దేశం నాకెన్నడూ లేదు. ఏ నేరమూ చేయని నేనెందుకు రాజీ పడాలి?

ఏదాస్యానికయినా అంగీకరిస్తాను కానీ భావదాస్యాన్ని భరించలేను. అదేనా నా తప్పు?

ఆడబుద్ధి....అడబుద్ధంటారు కానీ మగబుద్ధి మాటేమిటి?

## పాఠకులకు:
## మరొక కొత్త శీర్షిక

ముఖ సౌందర్యాన్ని, శరీర సౌందర్యాన్ని ఎలా కాపాడుకోవాలి? వాటికి ఏమేం పద్ధతులు అవలంబించాలి? చిట్కాలు ఏమిటి? ఎలాంటి వేళల్లో ఎలాంటి దుస్తులు ధరించాలి? చౌకలో మంచి దుస్తులు ధరించాలంటే ఎలా? సులభంగా చెయ్యగలిగే చేతిపనులు ఏమిటి? మొదలైన అందచందాలు, వస్త్రధారణ, హస్త కళలకు సంబంధించిన పలు సందేహాలను పాఠకులు ప్రశ్నల రూపంలో "వనిత"కు పంపితే వాటికి–సమాధానాలు ప్రచురించగలము.

ఈ శీర్షికను 'వనిత' పాఠకులకు పరిచితురాలైన ఛాయా ఆర్య (బొంబాయి) నిర్వహిస్తారు. పాఠకులు తమ ప్రశ్నలను కార్డుల మీద రాసి,

ఎడిటర్ 'వనిత' చందమామ బిల్డింగ్స్,
మద్రాసు–600 026
చిరునామాకు పంపితే చాలు.

ఈ శీర్షిక 'వనిత' జన్మదిన సంచికలో ఆరంభమవుతుంది.